ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 23 మే 2024



భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి 8లో..

కార్మికుల క్వార్టర్లకు కలుషిత నీటి సరఫరా 8లో..

# గ్రీన్ సిగ్నల్




- రామగుండం-మణుగూర్ రైల్వేలైన్‌కు అడుగులు
- నాలుగు జిల్లాల్లో భూసేకరణకు గెజిట్ జారీచేసిన కేంద్రం
- ఇరవై ఏళ్ల కిందటే ప్రతిపాదనలు
- అనుసంధానం కానున్న కోల్ కారిడార్
- లైన్ పూర్తయితే తగ్గనున్న 90 కిలోమీటర్ల దూరభారం

పెద్దపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): కోల్ కారిడార్‌ను కలిపేందుకు ఇరవై ఐదేళ్ల క్రితం ప్రతిపాదించిన రామగుండం-మణుగూర్ బ్రాడ్ గేజ్ రైల్వేలైన్ మార్గానికి అడుగులు పడుతున్నాయి. సర్వే పూర్తయిన ఈ లైన్ నిర్మాణానికి పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కావాల్సిన భూసేకరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్ జారీ చేసింది. 207.80 కిలోమీటర్ల దూరంగల ఈ రైల్వేలైన్ రాఘవాపూర్ నుంచి మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపూర్, గోపాల్‌రావుపేట్, రామానుజపురం మీదుగా మణుగూర్ వరకు నిర్మించనున్నారు. ఈ లైన్ నిర్మాణానికి ఇప్పటికే సర్వే పూర్తి చేసి రైలు మార్గంలో మట్టి నమూనాలు తీసి పరీక్షలు కూడా చేశారు. భూసేకరణ పూర్తయిన తర్వాత నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి.

ఈ లైన్ పూర్తయితే ప్రయాణికులకు దూర భారం తగ్గడంతోపాటు బొగ్గు రవాణా ఖర్చులు తగ్గనున్నాయి. న్యూఢిల్లీ- చెన్నై గ్రాండ్ ట్రంక్ లైన్‌లో నాగాపూర్-విజయవాడ సెక్షన్‌లో కీలక ప్రత్యామ్నాయ మార్గంగా మార నున్నది. అలాగే దీంతో పాటు ప్రతిపాదించిన భద్రాచలం రోడ్- కొవ్వూర్ లైన్ పూర్తయితే విశాఖపట్నం లైన్‌కు కూడా అనుసంధానం చేసేందుకు అవకాశాలున్నాయి. సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్న మణుగూర్, ఇల్లందు, కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల జిల్లాలో గల మందమర్రి, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, తదితర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న కోల్ కారిడార్‌ను కలిపేందుకు 2004లో ఈ రైల్వే లైన్‌ను అప్పుడు ఎంపీగా ఉన్న గడ్డం వెంకటస్వామి ప్రతి పాదించారు.

ఆ తర్వాత మాజీ ఎంపీలు డాక్టర్ జి వివేక్, బాల్క సుమన్, ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతలు కేంద్ర ప్రభు త్వంపై బడ్జెట్ కేటాయింపుల కోసం ఒత్తిడి తీసుకు వచ్చారు. ప్రతి బడ్జెట్‌లో దీని ప్రస్తావన వస్తున్నప్ప టికీ కేటాయింపులు ఏమి లేకపోవడం గమనార్హం. 2004 నుంచి 2009 వరకు యూపీఏ ప్రభుత్వంలో రైల్వే శాఖ మంత్రిగా లాలూ ప్రసాద్ యాదవ్ ఉన్న సమయంలో 2009లో ఈ లైన్ కోసం సర్వే చేయా లని బడ్జెట్‌లో పెట్టారు. అప్పటినుంచి పెద్దగా బడ్జెట్ కేటాయింపులు లేనప్పటికీ, ఈ లైన్ నిర్మాణం ఉండదు అనుకొని నిరాశకు గురవుతున్నప్పుడల్లా సర్వే కోసం కొన్ని నిధులు కేటాయిస్తూ వచ్చారు. 2023-24 బడ్జెట్‌లో కూడా ఫైనల్ లోకేషన్ సర్వే కోసం 3600 కోట్ల రూపాయలు కేటాయించారు. ఆ సర్వే తుది దశకు చేరుకున్నది. మూడు రకాల లైన్లలో సర్వే చేశారు. ఇందులో ఏదీ దూరం తక్కువగా ఉంటుంది, భూసేకరణకు ఉన్న ఆటంకాలు ఏమిటీ, తదితర అంశాలను పరిశీలించిన తర్వాత ఒక రూట్‌ను క్లియర్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

**● ప్రయాణికులకు సౌకర్యవంతంగా..**

రామగుండం నుంచి పెద్దపల్లి మధ్యన గల రాఘవాపూర్ స్టేషన్ నుంచి ఈ లైన్‌ను 207.80 కిలోమీటర్ల దూరం గల మణుగూర్‌కు రైల్వేలైన్ నిర్మించనున్నారు. బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్న రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం ప్రాంతాలను ఈలైన్ అనుసంధానం చేయనున్నది. ప్రస్తుతం భద్రాచలం, మణుగూర్ వెళ్లాలంటే సింగరేణి రైలులో ప్రయాణించాల్సి ఉంటుంది. రామగుండం నుంచి కాజీపేట, డోర్నకల్, భద్రాచలం రోడ్ మీదుగా మణుగూర్ వరకు రైలు నడుస్తున్నది.

ఈ మార్గం దూరం 291 కిలోమీటర్లు కాగా, రామగుండం- మణుగూర్ రైల్వే లైన్ పూర్తి చేస్తే దాదాపు 90 కిలోమీటర్ల వరకు దూర భారం తగ్గనున్నది. అంతేగాకుండా బొగ్గు రవాణా భారం కూడా తగ్గనున్నది. ప్రయాణికులకు ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉండనున్నది. ఆసియా ఖండంలోనే జన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క సారలమ్మ, భద్రాచల సీతారాముడిని దర్శించుకు నేందుకు ఈ మార్గం గుండా ప్రయాణించేందుకు మరింత సౌకర్యవంతంగా ఉండనున్నది. ఈ లైన్‌కు భూసేకరణ చేసేందుకు గెజిట్ జారీ కావడంతో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు త్వరలోనే లేఖలు అందనున్నాయి.

రైల్వే శాఖ అధికారులు ఇచ్చే ఫైనల్ లోకేషన్ సర్వే రిపోర్టు ఆధారంగా ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, సర్వే ల్యాండ్ అధికారుల ద్వారా ఎంత విస్తీర్ణంలో భూమి అవసరం ఉంటుంది. ఇందులో ప్రభుత్వ భూములు ఎన్ని, పట్టా భూములు ఎన్ని, అటవీ శాఖ పరిధిలో ఉన్న భూములు ఎన్ని అని గుర్తించిన తర్వాత కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు వచ్చిన తర్వాత భూసేకరణకు గెజిట్ జారీ చేయనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిపి భూములను సేకరించనున్నారు. వచ్చే బడ్జెట్‌లో భూసేకరణతో పాటు, లైన్ నిర్మాణానికి కొంత మేర కు డబ్బులు కేటాయించే అవకాశాలున్నాయి. మొత్తంగా ఈ లైన్ పూర్తయ్యే నాటికి 10 నుంచి 15 ఏళ్లు పట్టవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

**- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

పెద్దపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా ఇసుక, ఇతర గనుల మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అరికట్టేం దుకు గట్టి నిఘా పెట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, ఇతర గనుల నుంచి అక్రమంగా తరలించడం చట్ట ప్రకారం నేరమని, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, మైనింగ్, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అక్రమ మైనింగ్ నివారణకు కృషి చేయాలని అన్నారు. మానేరు నది వద్ద ఇసుక మైనింగ్‌కు జిల్లాలో ప్రస్తుతం ఎటువంటి అనుమతి లేదని, మానేరు నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, మానేరు నది పరివాహకం వద్ద ఇసుక మైనింగ్ పట్ల ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని అప్పటి వరకు అక్కడి నుంచి ఇసుక తీసుకువెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. అక్రమ మైనింగ్, ఇసుక రవాణా చేసే వాహనాల యజమానులు, డ్రైవర్లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అక్రమ మైనింగ్, ఇసుక రవాణా పట్ల ప్రజలు సెల్ నెంబర్ 7995070699కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, వెంటనే అక్రమ మైనింగ్ ఇసుక తరలింపు నిలిపి వేసేలా చర్యలు తీసుకుంటూ, అక్రమాలకు పాల్పడుతున్న వారిని చట్టప్రకారం శిక్షిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

## అక్రమ మైనింగ్‌ను కట్టడి చేయాలి

**- మంథని ఆర్డీవో హనుమా నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి, మే 22: అక్రమ మైనింగ్‌ను కట్టడి చేయాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ హెచ్చరించారు. బుధవారం రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో డివిజన్ తహసీల్దార్‌లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌లో జరిగే అక్రమ మైనింగ్ పనులపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మైనింగ్, నీటి పారుదల, ఇతర శాఖలు సమన్వయంగా కట్టడి చేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు. డివిజన్‌లో అక్రమ మైనింగ్‌ను ఆరికట్టేందుకు గట్టి నిఘా పెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసినట్లైతే ఎంతటి వారైనా చర్యలు చేపట్టాలని సూచించారు. మానేరు నది వద్ద ఇసుక మైనింగ్‌కు జిల్లాలో ప్రస్తుతం ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. అక్రమ ఇసుక తరలింపు చేపట్టే ట్రాక్టర్‌లను సీజ్ చేయాలన్నారు. అదే విధంగా కేసులు నమోదు చేయాల్సిందిగా సూచించారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసినట్లైతే 7995070699 నంబరు కాల్ చేసిన సమాచారం అందించాలని ప్రజలకు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు రాంచందర్‌రావు, రాజయ్య, సుమన్, వివిధ మండలాలకు చెందిన ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లిటౌన్, మే 22: జిల్లాలో ఈనెల 24 జరగబోయే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 16 సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు, రామగుండం పరిధిలో 4, పెద్దపల్లి పరిధిలో 4, మంథని పరిధిలో 2, సుల్తానాబాద్ పరిధిలో 2, శ్రీరాంపూర్, ధర్మారం, జూలపల్లి, ముత్తారం పరిధిలో ఒక్కొక్క పరీక్షా కేంద్రం చొప్పున ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు సుమారు 3196, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2314 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండవ సంవత్సర విద్యార్థులకు సాయంత్రం రెండున్నర నుంచి ఐదున్నర వరకు పరీక్షలు నిర్వహించబడుతాయని, ప్రతి పరీక్షా కేంద్రానికి నియమించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లకు శిక్షణ ఇచ్చినట్లు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరా, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యం ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు ఒక జిల్లా పరీక్షల కమిటీ, రెండు సిట్టింగ్స్ స్క్వాడ్స్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసి, ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునే విధంగా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా కన్వీనర్ లక్ష్మీనర్సయ్య**

పెద్దపల్లి రూరల్, మే 22 : తెలంగాణ పాలిటెక్నిక్ డిప్లామా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ 2024 పరీక్ష ఈనెల 24 నిర్వహించనున్నట్లు పాలిసెట్ జిల్లా కన్వీనర్, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనుందని పేర్కొన్నారు. నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోని నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్షకు 2330 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మదర్ థెరిస్సా ఇంజనీరింగ్, డిప్లామా కళాశాల, ట్రినిటి డిగ్రీ కళాశాలల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్ మీద ఫొటో ప్రింట్ కానివారు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఐడి ప్రూఫ్ తీసుకొనిరావాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదని పేర్కొన్నారు.

## గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి చేయాలి

**- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత**



గుర్రాంపల్లిలో రికార్డులు తనిఖీలు చేస్తున్న డీపీవో ఆశాలత

పెద్దపల్లి రూరల్, మే 22 : గ్రామీణ ప్రాంత ప్రజలకు వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. బుధవారం మండలంలోని గుర్రాంపల్లి, ముత్తారం గ్రామాల్లో డీపీవో ఆశాలత సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత, సెగ్రిగేషన్ షెడ్డు నిర్వహణ, మంచినీటి బావి నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో ఆశాలత మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ప్రతి పనిని రికార్డు చేయాలన్నారు. వారి వెంట ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు సతీష్, శ్రీకాంత్ లతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

కళ్యాణ్‌నగర్, మే 22: గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన వేముల వనజ కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో మాట్లాడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా పరీక్షించిన వైద్యులు ఆమె కడుపులో భారీ కణితి ఉన్నట్టు గుర్తించారు. శస్త్ర చికిత్స నిపుణులు అయిన రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యులు వనజకు శస్త్ర చికిత్స నిర్వహించి భారీ కణితిని తొలగించారు. కణితి బరువు 15కిలోలు ఉన్నట్టు వైద్యులు బంగి అనీల్ కుమార్ తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో ఎప్పుడూ ఇంతపెద్ద కణితిని గుర్తించలేదని, ఇటువంటి ఆపరేషన్ వైద్య రంగంలో అరుదని మేయర్ పేర్కొన్నారు.

**మేయర్‌ను అభినందించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్**

వేముల వజన అనే మహిళ కడుపులో 15కిలోల కణితిని గుర్తించి విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన రామగుండం మేయర్ అనీల్ కుమార్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభినందించారు. రామగుండంలో మేయర్‌గా సేవలందిస్తూ మరోపక్క వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్న మేయర్‌కు అభినందనలు తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం..

ఓదెల, మే 22 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని డీవైఎస్‌వో సురేష్ అన్నారు. మండలంలోని కనగర్తి లో నిర్వహిస్తున్న వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని బుధవారం డీవైఎస్‌వో సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల్లో ప్రతిభ చూపినట్లయితే జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తారని తెలిపారు. అలాగే జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రమేష్, కొలనూర్ పీఈటీ తాండ్ర సదానందం పాల్గొన్నారు.

## నిమిషం ఆలస్యమైనా అనుమతించం

**- గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించమని, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో జూన్ 9న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీ నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 6098 మంది అభ్యర్థుల కోసం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలన్నారు. గ్రూప్1 పరీక్ష ప్రశ్నాపత్రాలు రెండు సెట్లు పరీక్షకు 2 రోజుల ముందు జిల్లాకు వస్తాయని, వాటిని వేర్వేరుగా పోలీస్ స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలన్నారు. పరీక్ష కేంద్రం ప్రాంగణంలో, భవనం వద్ద ప్రతి 100 మంది అభ్యర్థులకు ఒక్కరు చొప్పున ఐడెంటిటీ అధికారులను నియమించాలని, ప్రతి అభ్యర్థిని పూర్తి స్థాయిలో చెక్ చేయాలని, మహిళలను పరిశీలించేందుకు మహిళా సిబ్బంది, ప్రత్యేక కంపార్ట్మెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. హాల్ టికెట్‌పై ఫోటో సరిగ్గా లేకపోతే గెజిటెడ్ అధికారి లేదా అభ్యర్థి పూర్వపు విద్యాసంస్థతో ధ్రువీకరించిన లేటెస్టు ఫోటో అతికించి, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని తెలిపారు. పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, అభ్యర్థులు ఎవరు సెల్‌ఫోన్ తీసుకుని రావడానికి వీలులేదని, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సైతం సెల్‌ఫోన్ అనుమతి ఉండదని, ప్రతి పరీక్షా కేంద్రం ప్రాంగణంలో సెల్‌ఫోన్ డిపాజిట్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి, పరీక్ష నిర్వహణ సిబ్బంది, అభ్యర్థుల ఫోన్‌లు భద్రపరచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకునేందుకు వీలుగా అవసరమైన మేర ఏర్పాట్లు చేయాలని సూచించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం ప్రత్యేక ఇన్విజిలేటర్‌లను నియమించాలని, ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధ్రువీకరించుకోవాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లో 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపుకార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు. పరీక్ష ప్రారంభ సమయంలో లాంగ్ బెల్, ప్రతి అరగంట సమయానికి బెల్ మోగే విధంగా ఏర్పాట్లు చేయాలని, ఒంటి గంటకు పరీక్ష ముగుస్తుందని, పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు తప్పనిసరిగా వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ అధికారి పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని, ప్రతి హాల్, ప్రాంగణం పూర్తిగా తనిఖీ చేయాలని తెలిపారు. పరీక్ష నిర్వహణ సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 8న ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్, ఇన్విజిలేటర్‌లు, సెక్యూరిటి సిబ్బంది, ఐడెంటిటీ అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్షా హాల్లో సీటింగ్ అరేంజ్మెంట్ కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరగాలని, ప్రతిఅంశం సీసీ కెమెరాలో రికార్డు అయ్యేలా చూడాన్నారు. ఆర్డీవోలు హనుమానాయక్, గంగయ్య, ఏసీపీ క్రిష్ణ, డీఈవో మాధవి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణంతో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లు



పైప్‌లైన్ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, మే 22: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌పరిధిలోని గోదావరిఖని మార్కండేయకాలనీ శివాలయం రోడ్డులో గ్యాస్ పైప్ లైన్ నిర్మాణ పనులు చేస్తుండగా మంచినీటి సరఫరా పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతాన్ని బుధవారం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పరిశీలించారు. పైప్‌లైన్ దెబ్బతినడంతో అశోక్‌నగర్ ఓవర్‌హెడ్ ట్యాంక్ పరిధిలోని గాంధీనగర్, అశోక్‌నగర్ మార్కండేయకాలనీ పార్ట్, హనుమాన్‌నగర్, లెనిన్‌నగర్, అంబేద్కర్‌నగర్, మల్లికార్జున్‌నగర్, సీతానగర్, రాంనగర్, సంజయ్‌నగర్, జ్యోతినగర్, 5ఇంక్లైన్ ఏరియా పార్ట్‌తో పాటు సీఎస్‌పీ ఓవర్‌హెడ్ ట్యాంక్ పరిధిలోని విద్యానగర్, సూర్యనగర్, బాపూజీ నగర్, జీఎంకాలనీ, గంగానగర్, జనగామ ప్రాంతాలకు బుధ, గురువారాలు రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టడం జరుగుతున్నాయని, శుక్రవారం నుంచి యధాతథంగా నీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

## వేతనాలు అందక నర్సింగ్ స్టాఫ్ ఇబ్బందులు



గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కళ్యాణ్‌నగర్, మే 22: ప్రభుత్వం గత మార్చిలో కొత్తగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 250మంది నర్సింగ్ స్టాఫ్‌ను నియమించింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి 362పడకలుగా అప్‌గ్రేడ్ అయిన తరువాత ప్రభుత్వం నూతనంగా 250మంది స్టాఫ్ నర్సులను, నర్సులను నియమించింది. మూడు నెలలుగా వారికి వేతనాలు ఇవ్వడం లేదు. కనీసం వారిని గుర్తింపు ఇస్తున్నట్టుగా ఐడెంటిఫికేషన్ కానీ, ఎంప్లాయి కోడ్ కానీ ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వీరికి సంబంధించిన వేతనాలను చూడాల్సి ఉండగా వారి వేతనాల గురించి ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. ఆసుపత్రి సిబ్బంది ఎన్ని సార్లు అడిగినా తమ చేతుల్లో ఏమి లేదంటూ డీఎంఈ ఆఫీస్‌కు వెళ్లాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారంటూ నర్సింగ్ స్టాఫ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారిని కనికరించే వారే లేరు. గతంలో తలాకొంత డబ్బులు వేసుకుని ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారు. కానీ వారి పట్ల ఎవరూ కనికరించడం లేదు. ప్రతి నెల ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందికి ఏఓ విభాగం వారి వేతనాలను డీఎంఈ ఆఫీస్‌కు పంపాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు వారి వేతనాలను పంపకపోవడంతో నర్సింగ్ స్టాఫ్ ఇబ్బందులు పడుతున్నారు.

**ఒక్కొక్కరి నుంచి వెయ్యి రూపాయలు వసూలు..**

ఆసుపత్రిలో నూతనంగా నియామకమైన నర్సింగ్ సిబ్బంది నుంచి వారికి వేతనాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేసినట్టు తెలిసింది. సూపరింటెండెంట్‌ను కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. గత మార్చిలో ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నర్సింగ్ స్టాఫ్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. కానీ ఇప్పటి వరకు వారికి వేతనాలు అందలేదు. తమకు వేతనాలు ఇప్పించాలంటూ నర్సింగ్ సిబ్బంది వేడుకుంటున్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా చేపట్టాలి

**● అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్**



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ధర్మారం, మే 22 : రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని అదనపుకలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. బుధవారం మండలంలోని నందిమేడారంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కురిసిన అకాల వర్షం కారణంగా తూకం వేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ఆయా రైస్ మిల్లులకు తరలించాలని ఆయన సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లై మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చందుర్తి, మే 22: మండలం మల్యాల గ్రామంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిటుకు లచ్చయ్య అనే వ్యక్తి భార్యతో కలిసి ఉదయం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం లచ్చయ్య ఇంట్లో నుండి ఒక్కసారి మంటలు వచ్చాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే లచ్చయ్యకు సమాచారం అందించారు. గ్రామస్తుల సహాయంతో మంటలు ఆర్పారు. ఇంట్లో నిల్వ ఉంచిన ధాన్యం, మొక్కజొన్న, బియ్యం, ఇతర సామాగ్రి మంటల్లో కాలిపోయాయి. దాదాపు రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లందని బాధితుడు వాపోయాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇంట్లోని వాషింగ్ మిషన్ ద్వారా మంటలు వ్యాపించినట్లు పేర్కొన్నారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## వృద్ధురాలి అదృశ్యం

హుజూరాబాద్‌రూరల్, మే 22: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల లక్ష్మీ రెండు రోజుల నుంచి కనింపించడం లేదు. కుటుంబస భ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగిత్యాల టౌన్, మే 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుకబావి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. తులసీ నగర్‌కు చెందిన పల్లికొండ రాజయ్య(60) అనే వృద్ధుడు ఇంటి ముందు నిలబడి ఉండగా ఓ బాలుడు మిని వ్యాన్‌ను అజాగ్రత్తగా నడుపుతూ రాజయ్యను బలంగా ఢీ కొట్టాడు. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా పోచయ్య అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. రాజయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

కోనరావుపేట, మే 22: కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పేకాట ఆడుతున్న జిన్న బాబు, మోకనపల్లి రాంబాబు, ఎనగంటి రమేష్, మోకనపల్లి దేవరాజు, జాగిరి కిరణ్, అలిపిరి ఆనందం లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2970 రూపాయలను 6 సెల్‌ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ప్రయాణికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ బస్సు డ్రైవర్

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సును నిలిపి సుమారు 40 నిమిషాల పాటు డ్రైవర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందలను ఎదుర్కొన్నారు. ఎపీ 29జెడ్1797 నంబర్‌గల ఆర్టీసీ బస్సును బస్టాండులోని నిలిపి వుంచడంతో ప్రయాణికులు పూర్తిగా నిండిపోయారు. సుమారు 40 నిమిషాలపాటు డ్రైవర్ రాకోవడంతో విసుగు చెందిన ప్రయాణికులు డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో డ్రైవర్ ప్రయాణికులపై అనుచిత వాఖ్యలు చేసినట్లు వేములవాడ పట్టణానికి చెందిన పిన్నింటి హన్మాండ్లు తెలిపారు.

## పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిష్టంపల్లి సమీపంలో వ్యవసాయ పొలాల్లో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్గమైంది. సుమారు పది మంది రైతులకు చెందిన 50 ఎకరాల విస్తీర్ణంలోని గడ్డి పూర్తిగా కాలిపోయింది. రైతు నూకల శ్రీనివాస్ వ్యవసాయ పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానికి ఒకటి రాపిడి జరిగే నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. మంటలు ఒక్కసారిగా పంట పొలాలను చుట్టుముట్టడంతో రైతులు చేరుకొని ఆరేందుకు ప్రయత్నించారు.

విద్యుత్ స్టార్టర్లు కరెంటు తీగలు సాగునీటి పైపులు పసుగ్రాసం పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. సుమారు రూ లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపంటికైనా కరెంటు తీగలను సరి చేయడంతో పాటు తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

# కళతప్పిన సినారె కళామందిర్


కళావిహీనంగా మారిన సినారె కళామందిరం


పగిలిన సినారె కళామందిర్ కిటికీలు


చెత్తతో నిండిపోయి దర్శనమిస్తున్న కళామందిర్

- చెత్త బండ్లకు నిలయంగా మారిన వైనం
- నూతన భవనానికి మంజూరైన రూ. 5 కోట్లు
- నిధులు సరిపోవని ముందుకు రాని కాంట్రాక్టర్లు
- నూతన భవనాన్ని నిర్మించాలని కళాకారుల డిమాండ్

వేములవాడ టౌన్, మే 22: దేశ విదేశాల్లో ప్రఖ్యాతిగాంచిన విశ్వంభరుడు డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి(సినారే) స్వస్థలం అయిన వేములవాడలో ఏర్పాటు చేసిన సినారె కళామందిరం కళతప్పుతోంది. వేములవాడ ప్రాంతంలోని ఎంతో మంది కళాకారులను సినారే నిర్మించిన కళామందిర్ అక్కున చేర్చుకుంది. అయితే సినారె కళామందిర్ భవనాన్ని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మెంటనేన్స్‌ను చూస్తున్నారు. కొంతకాలంగా సినారే కళామందిర్ ఆలనపాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరకుంది. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని చెత్తను సేకరించే ఆటోలకు అడ్డాగా మారింది. సినారె కళామందిర్ చెత్తచెదారంతో నిండిపోయింది. వెంటిలేటర్లు పూర్తిగా పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో సినారె కళామందర్ వద్దకు వెళ్లగానే కంపు వాసన వస్తుందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**● నిధులు మంజూరైనా..**

సినారే కళామందిర్ నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీయూఎఫ్ఐడీ నిధులు ఐదు కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ ఏఈ సతీష్ తెలిపారు.

సినారె కళామందిర్ నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు ఏమాత్రం సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. సినారే కళామందిర్‌కు మంజూరైన నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం టీయూఎఫ్ఐడీ నిధులను కొన్ని జిల్లాలో ప్రభుత్వం ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. సినారె కళామందిర్‌కు సంబంధించిన నిధులు ఫ్రీజ్ చేశారా.. అలానే ఉన్నాయా.. అనే విషయం ఆర్అండ్‌బీ ఏఈని అడుగగా తనకు కూడా పూర్తి స్థాయిలో తెలియదని సమాధానమిచ్చారు.

**● నూతన భవనాన్ని నిర్మించాలి**

**- మారం ప్రవీణ్ (పప్పి) కళాకారుడు, వేములవాడ**



దేశ, విదేశాల్లో గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి సినారే, దేశం మొత్తం సినారేను కీర్తిస్తే తన సొంత మండలమైన వేములవాడలో సినారె కళామందిర్ ఆలనపాలన నోచుకోకపోవడం సిగ్గుచేటు. గత ప్రభుత్వం హయాంలో ఐదు కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని సినారె కళామందిర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దాలి.

**● సినారేతో అనుబంధం మరువలేనిది**

**- గూడూరి నర్సన్, గజల్ కవి, వేములవాడ**



సినారేతో తన అనుబంధం మరువలేనిది. తనతో సన్మానం పొందిన వాడిగా ఇప్పటికీ మర్చిపోను. వేములవాడలో సినారె కళామందిర్ కళతప్పడం బాధకరంగా ఉంది. సినారె కళామందిర్‌ను అద్భుతంగా నిర్మాణం చేసి గౌరవించాలి. ఈ ప్రాంత కళాకారులు సినారేను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి సినారే కళామందిర్ నూతన భవనాన్ని త్వరగా నిర్మించాలి.

## వైన్ షాపులో చోరీ


సీసీ ఫుటేజికి చిక్కిన అనుమానితుడు

ఓదెల, మే 22: మండల కేంద్రంలోని మల్లికార్జున బ్రాంది షాపులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. అర్ధరాత్రి దాదాపు రెండు గంటల సమయంలో భవనం వెనుక ఉన్న తలుపులను తీసుకొని వైన్ షాపులోకి చొరబడ్డాడు. షాపులో వెతికిన అనంతరం కౌంటర్లో ఉన్న రూ.1.70 లక్షలను ఎత్తుకెళ్లాడు. అలాగే ఒక కవర్లో దాచిపెట్టిన మరో రూ.లక్ష దొంగ కంట పడకపోవడంతో వాటిని అక్కడే వదిలిపెట్టి కౌంటర్లో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లాడు. షాపు యజమాని కాసర్ల స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై అశోక్ రెడ్డి, ఏఎస్ఐ రత్నాకర్, హెడ్ కానిస్టేబుళ్లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం సీసీ ఫుటేజీలను పరిశీలించగా దొంగగా అనుమానిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఫుటేజీలకు చిక్కాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

# సమస్యల వలయంలో పీహెచ్‌సీ

- సిబ్బంది కొరతతో రోగుల ఇక్కట్లు
- ఊరికి ఆమడ దూరంలో కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం



కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం

భగత్‌నగర్, మే 22: కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరతతో రోగులకు సరైన వైద్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపల్లి గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించినా ఆరోగ్య కేంద్రం పరిస్థితి తీరు మారడం లేదు. కొత్తపల్లి ప్రధాన రహదారి నుంచి మూడు కిలో మీటర్ల మేర లోపలికి వెళితే కాని రోగులకు ఆరోగ్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపల్లి పట్టణంతో పాటు కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోగులు ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాలంటే ప్రత్యేకంగా ఆటోను తీసుకుపోవాలి లేదా సొంత వాహనంలోనే రావాల్సి ఉంటుంది. రోగి ఆరోగ్య కేంద్రానికి చేరుకునే సరికే ఉన్న రోగం కాస్త ముదిరే పరిస్థితులు ఉన్నాయి.

**● సిబ్బంది కొరత..**

కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు గాను ఒకరు ఆసిఫ్‌నగర్ మెడికల్ ఆఫీసర్ కాగా, ఒకరు నగరంలోని టీబీ ఆసుపత్రి నుంచి ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం కింద నాలుగు సబ్‌సెంటర్లు ఉండగా 8 మంది ఏఎన్ఎంలకు గాను రెండు ఖాళీలు ఉన్నాయి. ఒక స్టాఫ్‌నర్సుతో పాటు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేల్ సూపర్‌వైజర్ డిప్యూటేషన్‌లో ఉన్నారు.

**● పత్తాలేని ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం నిర్మాణం..**

కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌కు ఆరోగ్యకేంద్రం మంజూరైనా నడిచేందుకు అనువైన పరిస్థితులు కల్పించడం లేదు. ఆసిఫ్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రం భవనం లేక ఇక్కడున్న సిబ్బంది కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం నుండే విధులు నిర్వహించాల్సి వస్తున్నది. ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో ఇరువురు వైద్యులకు గాను ఒకరు మాత్రమే ఉన్నారు. ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం కింద ఐదు సబ్‌సెంటర్లకు గాను ఆసిఫ్‌నగర్, ఎలగందల్, కమాన్‌పూర్, చింతకుంటలో పక్కా భవనాలు ఉన్నాయి. నాగుల మల్యాలలో పక్కా భవనం లేదు. ఒక హెచ్ఈఓ పోస్టు, కమాన్ పూర్‌లో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆసిఫ్‌నగర్‌లో ఉండాల్సిన ఫార్మసిస్టు ఒక రోజు వచ్చి డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఆసిఫ్‌నగర్‌లో ఉన్న గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కూలీలను దృష్టిలో ఉంచుకొనైనా ఆ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రాన్ని పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించాలి

- జాగ్రత్తగా పంటల వివరాలను నమోదు చేయాలి - కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మే 22: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. పంటల బీమాతో రైతులకు ఎంతో ధీమా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, ఉద్యానవన అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా పంటల వివరాలను వ్యవసాయ అధికారులు జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఫసల్ బీమా యోజన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంటలకు నష్టం జరిగినప్పుడు దీని ద్వారా పరిహారం అందుతుందని పేర్కొన్నారు. రైతులు బీమా చెల్లించే అవసరం లేదని, ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని వివరించారు. అధికారులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచించారు. ఫసల్ బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారని చెప్పారు. పంట దిగుబడి ఆధారంగా, వాతావరణ పరిస్థితుల అనుగుణంగా బీమా నిర్ణయిస్తారని తెలిపారు. దీంతో జిల్లాలో ఎక్కువగా సన్న కారు, చిన్న కారు రైతులు ఉన్నారని, క్లస్టర్ అప్రోచ్ ద్వారా ఎక్కువ మంది రైతులు లాభపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంలో అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన జేడీఏ బాలునాయక్ ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించా రు. మాస్టర్ ట్రైనర్లు మమతా, ప్రతిభ, భూంరెడ్డి ఈ పథకంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఉమ్మడి ఇజిల్లా సీపీవోలు కొమురయ్య, పీబీ శ్రీనివాస్ పూర్ణచంద్రరావు, షబానా సుల్తానా, ఉద్యానవనాధికారులు బి శ్రీనివాసు, జ్యోతి, ప్రతాప్ సింగ్, జగన్మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల వ్యవసా య అధికా రులు బత్తుల శ్రీనివాస్, ఆదిరెడ్డి, భాస్కర్, వాణి పాల్గొన్నారు.

**● కేడీసీసీ బ్యాంకు సందర్శన**

కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకును కలెక్టర్ పమేలా సత్పతి బుధవా రం సందర్శించారు. సీఈవో సత్యనారాయణరావు, బ్యాంక్ అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కేడీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు దేశంలోనే రోల్ మోడల్‌గా మారిందని సీఈవో కలెక్టర్‌కు వివరించారు. చొప్పదండి పీఏసీఎస్ దేశంలోనే అత్యుత్త మంగా నిలిచిందని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్లు ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, పీ ఏసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, డీజీఎంలు ఏజీఎంలు, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కూలీ మృతి

కోల్‌సిటీ, మే 22: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పునాది బెడ్‌పై పడి గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన రావుల విజయ్(47) అనే వ్యక్తి మృతి చెందాడు. కూలీ పని చేసుకుంటూ జీవించే విజయ్ మంగళవారం రాత్రి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న తన బంధువులను పరామర్శించేందుకు వెళ్లాడు. మూత్ర విసర్జనకు భవన నిర్మాణం వైపు వెళ్లగా చీకట్లో జారి ర్యాఫ్ట్ ఫౌండేషన్ బెడ్‌పై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం నిర్మాణ కూలీలు విజయ్ మృతదేహాన్ని గుర్తించి సైట్ ఇన్‌చార్జికి సమాచారం ఇచ్చారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ సౌజన్య ఘటన స్థలంలో విచారణ జరిపారు. మృతుని తల్లి రావుల జయశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

## మట్టిని తరలిస్తున్న టిప్పర్లు సీజ్

పెద్దపల్లి రూరల్, మే 22: జూలపల్లి మండలంలోని అల్లూరు చెరువు నుంచి టిప్పర్‌ల ద్వారా మండలంలోని రాఘవపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్‌ల ద్వారా తరలిస్తుండగా తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లకు అనుమతులు లేకపోవడంతో పాటు, వే బిల్‌లు లేవని దీంతో ఎనిమిది మట్టి టిప్పర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వారి వెంట ఆర్ఐలు నవీన్‌రావు, ఇంతియాజ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# వైభవంగా భూనీళా సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

- నాంపల్లి గుట్టపైన అంగరంగా వైభవంగా నిర్వహణ - భారీగా తరలివచ్చిన భక్తులు


ఉత్సవమూర్తులను కల్యాణవేదికకు తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు


మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు


కల్యాణానికి హాజరైన భక్తులు

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీభూనీళా సమేత లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణాన్ని బుధవారం ఆలయ అర్చకులు, అధికారులు అంగరంగా వైభవోపేతంగా నిర్వహించారు. రాజన్న ఆలయ అర్చకులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో కన్యదాతలుగా రాచకొండ రామాచార్యులుసంధ్య రాణి ఆధ్వర్యంలో అర్చకులు విజయసింహచారి, రామకృష్ణచారి, హర్షవర్ధన్‌లు వేద మంత్రాలతో కళ్యాణతంతును కన్నుల పండువగా చేపట్టారు. నాంపల్లి గుట్టపైన కొలువుదీరిన శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం క్రింది భాగంలోని కళ్యాణ వేధికవద్దకు బాజాభజంత్రీలతో తీసుకువచ్చారు. ఊరేగింపు సమయంలో సేవాధారులు, భక్తుల నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. స్వామి వారి కల్యాణంలో భాగంగా రాజన్న ఆలయ ఏఈవో బ్రమ్మన్నగారి శ్రీనివాస్ స్వామి వార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. కల్యాణమహోత్సవానికి నాంపల్లి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, సూపరిండెంట్‌లు సరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్‌చార్జ్ నరేందర్ అధికారులు శ్రీనివాస్, మాధవరావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

**నల్లగొండలో..**

**కొడిమ్యాల:** మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నర్సింహస్వామి జయంతిని పురస్కరించుకొని బుధవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాదం వితరణతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, యాగ్నికుడు శ్రీనాథచార్యులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**టీర్‌పూర్:** బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొండపైన ఉన్న లక్ష్మీ నరసింహుని ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించకున్నారు. సాయంత్రం స్థంబ ఆవిర్భావ పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 22: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌కు చెందిన చింతోజు రమేశ్ (43) అనే ఎలక్ట్రికల్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... బుధవారం ఉదయం రమేశ్ అనే ఎలక్ట్రికల్ వ్యాపారి షాప్ తెరిచి స్నేహితులను కలిసి ఇంటికి వెళ్లి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. శివనగర్‌కు చెందిన రమేశ్ కోర్టుకు ఎదురుగా శ్రీరామ ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య కళ్యాణి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొంతకాలంగా షాప్ సరిగా నడవకపోవడంతో దాదాపు 20లక్షల రూపాయల వరకు అప్పులు పాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆస్తుల పంపకంలో తల్లిదండ్రులతో కలహాలు మొదలయ్యాయి. వారం క్రితం భార్య, పిల్లలు తల్లిగారింటికి వెళ్లారు. ఇళ్ల పంపకం విషయంలో కుటుంబసభ్యుల మధ్య గొడవలు ఏర్పడడంతో మనస్తాపం చెందిన రమేశ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించి పంచనామా చేశారు. తన భర్త ఆత్మహత్యకు అత్త, మామలు, మరిదే కారణమని, తన పిల్లలకు ఆధారం చూపాలని భార్య కళ్యాణి వేడుకుంది. దీంతో రమేశ్ మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో జాప్యమైంది. చివరికి ఇళ్లు ఇవ్వ డానికి రమేశ్ తల్లిదండ్రులు అంగీకరించడంతో పోస్టుమార్టం అనంతరం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడడంతో వ్యాపారులు, స్నేహితులు, కుటుబసభ్యులు చేరుకొని విలపించడం కలిచివేసింది. భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఎండపల్లి, మే 22: మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య(51) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య, అతడి భార్యతో కలిసి మూడు రోజుల క్రితం తన బిడ్డ ఇంటికి కుక్కలగూడూర్‌కి బైక్‌పై వెళుతుండగా పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం వేంనూర్ గ్రామంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో తనుగుల రామయ్య, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన ధీకొండ మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మహేందర్ మంగళవారం మృతి చెందగా, రామయ్య చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

## గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 22: మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన మల్యాల లక్ష్మయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. లక్ష్మయ్య ఎప్పటి లాగే కల్లు గీయడానికి బుధవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొడిమ్యాల, మే 22: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన ఒంటెద్దు బాబు(50)అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొడిమ్యాల హెడ్ కానిస్టే బుల్ అర్జ రాజు బుధవారం తెలిపారు. హెడ్ కానిస్టెబుల్ తెలిపిన వివరాల మేరకు హమాలి పని చేసుకొని జీవిస్తున్న బాబు కొంత కాలంగా తాగుడుకు బానిసై మంగళవారం ఉదయం కూలీ పనికి వెళ్లి తాగిన మైకంలో గుర్తు తెలియని క్రిమి సంహారక మందు తాగాడు. అతనిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని భార్య ఒంటెద్దు పద్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## రూ. 7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 24మంది రైతులు 326క్వింటాళ్ల విడి పత్తి, 16మంది రైతులు ఎనిమిది క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


ఖైరుద్దీన్(ఫైల్), రషీద్(ఫైల్)

మేడిపల్లి/మెట్‌పల్లి మే 22: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహమ్మద్ రషీద్ (60) అతని తండ్రి ఖైరుద్దీన్(85) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ ఉద్యోగి ఖైరుద్దిన్ వృద్ధాప్యరీత్యా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా వైద్య పరీక్షల కోసం కొడుకు రషీద్ కారులో కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి మెట్‌పల్లి బయలుదేరారు. ఈ క్రమంలో మేడిపల్లి మండలం సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబో యి ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు ఖైరుద్దిన్, రషీద్ అక్కడిక్కడే మృతి చెందారు. రషీద్ మెట్‌పల్లి మండలంలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నాడు. మృతుడు రషీద్ భార్య నస్రీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నవీన్, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ పంచనామా నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ పెట్రోలు బంక్ సమీపాన కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన కట్టె కోత మిషన్ నిర్వాహకుడు సంతోష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. సంతోష్ తన బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెపుకు వెళుతున్నాడు. అటు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న మరో యువకుడు ఒక్కసారిగా పెట్రోల్ బంక్ వైపుకు మలుపడంతో ప్రమాదం జరిగింది. సంతోష్ చేయి విరగడంతో పాటు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

## కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు సస్పెన్షన్

చేర్యాల/సిరిసిల్ల క్రైం మే 22: రెండో వివాహం చేసుకున్నాడన్న ఆరోపణలపై కొమురవెల్లి ఎస్ నాగరాజుపై పోలీసుశాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు. ఈమేరకు మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన ట్లు విశ్వసనీయంగా తెలిసింది. తనను వేధించడమే కాకుండా పిల్లలను తీసుకునివెళ్లి అందుబాటులో లేకుండాపోయాడని, ఇతర మహిళను రెండో వివాహం చేసుకున్నాడని పేర్కొంటూ ఎస్ఐ నాగరాజు భార్య మానస మంగళవారం రాత్రి కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి బంధువులతో కలిసి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై సిద్దిపేట సీపీ అనూరాధ ఇచ్చిన నివేదిక మేరకు ఉన్నతాధికారులు ఎస్ఐ నాగరాజుతో పాటు ఈకేసులో భాగస్వామిగా ఉన్న ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు.

## పత్తిపాకలో నృసింహస్వామిని దర్శించుకున్న అడ్లూరి



కార్యక్రమంలో పాల్గొన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మే 22: మండలంలోని పత్తిపాక గ్రామంలో బుధవారం జరిగిన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా బొట్లవనపర్తి గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

## ఖోఖో శిక్షణ కేంద్రం ఏర్పాటు గర్వకారణం

**- జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి సురేష్**



శిక్షణ పొందుతున్న వారితో డీవైఎస్‌వో సురేష్

సుల్తానాబాద్, మే 22 : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహించడానికి క్రీడాకారులను తయారుచేయడానికి ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ ఖోఖో శిక్షణ కేంద్రం మంజూరు చేసిందని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి సురేష్ అన్నారు. సుల్తానాబాద్‌లో మార్కండేయ కాలనీ వద్ద నిర్వహిస్తున్న ఖోఖో సెంటర్‌ను జిల్లా డీవైఎస్‌వో సురేష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, భారతదేశంలో ఖేలో ఇండియా కార్యక్రమంలో ఒకే ఒక ఖోఖో సెంటర్‌ను జిల్లాకు కేటాయించడం గర్వకారణమన్నారు. తెలంగాణలో ఉన్న అన్ని సెంటర్లలో కంటే జిల్లాలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, అందరూ క్రమశిక్షణగా క్రీడా నైపుణ్యాన్ని నేర్చుకుని దేశం గర్వపడేలా జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. సుల్తానాబాద్ శిక్షణ కేంద్రంలో ఒక ప్రత్యేకత ఉందని, కోచ్‌గా అంతర్జాతీయ క్రీడాకారుడు ఉండటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శంకరయ్య, సెంటర్ కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, పీఈటీలు ప్రణయ్, ఇక్బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

కమాన్‌పూర్, మే 22 : మండల పరిధిలోని గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ సరఫరాలో అంతరాయంతోపాటు రైతులు పంట పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం డీడీలు కట్టినప్పటికి పనుల్లో జాప్యం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అర్హులైన వారిలో కొంతమందికి మాత్రమే వస్తుందని, గ్రామాల్లో విద్యుత్ లూప్‌వైర్లతో పాటు తదితర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు ట్రాన్స్‌కో ఏఈ రాజేంద్రకుమార్ బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, తాటికొండ శంకర్, నీలం శ్రీనివాస్, బొమ్మగాని అనిల్‌గౌడ్, తోట రాజ్‌కుమార్‌లు ఉన్నారు.

# ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి



నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

కోల్‌సిటీటౌన్, మే 22: దేశంలోని అణగారిన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించిన మాల సామాజిక వర్గానికి చెందిన, మహోన్నతుడు వర్మ బిరుదాంకితుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షురాలు ఎం, వరలక్ష్మిలు అన్నారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలోని తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో మాదరి భాగ్యరెడ్డివర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు సమకాలికుడిగా పేరున్న భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ స్టేట్స్ నిజాం పాలన కాలంలో అణగారిన వర్గాల కోసం, విద్య సాంస్కృతిక, రాజకీయ చైతన్యం కోసం కృషిచేసిన మహోన్నతుడని కొనియాడారు. దళిత వర్గాల కోసం మొదటిసారిగా హైదరాబాద్ స్టేట్‌లో పాఠశాలలు నెలకొల్పి విద్యను అందించిన భాగ్యరెడ్డికి నిజాం ప్రభుత్వం వర్మ పేరిట బిరుదు ఇచ్చి సత్కరించిందన్నారు, ఆయన ఆశల కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా నిర్వహించాల్సిన కార్యక్రమమైనప్పటికీ ఈ ప్రాంతంలో భాగ్యరెడ్డివర్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, జిల్లా కోకన్వీనర్, దుబాసి బొందయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యు వజన సంఘం జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు, కొండ్ర వెంకటేష్, పెరిక రవి, కాజీపేట పోచం, గద్దల నవీన్ తదితరులు పాల్గొన్నారు,

# ఘనంగా రేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాలు

**- పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



వడుకాపూర్‌లో రేణుకా ఎల్లమ్మతల్లి వేడుకలు



నీరుకుల్లలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, మే 22 : మండలంలోని వడుకాపూర్ గ్రామంలో గౌడకులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా రేణుకా ఎల్లమ్మతల్లి బోనాలు, పట్నాల వేడుకలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోగల ఎల్లమ్మతల్లిని దర్శనం చేసుకునేందుకు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు ఆరెల్లి శ్రీనివాస్, గుర్రం పర్శరాములు, అంగిరి సంత్, గుర్రం సంపత్, రంగు మల్లయ్య, వడ్ల కొండ శ్రీనివాస్, రంగు బాపయ్య, రంగు రాములు, ఆరెల్లి స్వామి, గుర్రం కుమార్, వడ్లకొండ రవి, వడ్లకొండ తిరుపతి, పాలకుర్తి తిరుపతి, బొడిగె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్ :** మండలంలోని నీరుకుల్ల గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎల్లమ్మ పట్నాలను పురస్కరించుకొని గౌడ కులస్తులు వారి కుటుంబ సభ్యులు ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పట్నాల మహోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యే విజయరమణారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మినుపాల ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్, చిలుక సతీష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు తాజా మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్ ,బూరుగు అంజయ్య ,రమేష్, పొన్నం చంద్రయ్య, వీరస్వామి, అశోక్ గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓదెల, మే 22 : మండలంలోని రూపు నారాయణపేటలో బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే ఎల్లమ్మ తల్లి పట్నాలు వేయించి దర్శనం చేసుకున్నారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అలాగే బిజెపి నాయకుడు ఎగోలపు సదయ్య గౌడ్ ఎల్లమ్మ ఆలయం తో పాటు శానగొండలో గ్రామ దేవతలను సందర్శించి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ సర్పంచ్ అంకం రమేష్, సింగల్ విండో డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్ గౌడ్, గుర్రం పరుశరాములు, జీలకర్ర రవి, తిపాంరపు చిరంజీవి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పలు రైళ్ల రద్దు

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్, రెచ్ని, కాజీపేట స్టేషన్‌లలో నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ రూట్‌లో వెళ్లి వచ్చే పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. మే27నుంచి జూన్ 30వరకు భద్రాచలం రోడ్-విజయవాడ- భద్రాచలం రోడ్(07278), (07979)రైళ్లు, సికింద్రాబాద్-వరంగల్ (07462) వరంగల్-హైదరాబాద్ (07463)రైలు, కాజీపేట -బల్లార్షా(17035) రైలు, మే 27 నుంచి జులై1 వరకు బల్లార్షా- కాజీపేట (17036) రైలు, మే27 నుంచి జూన్30 వరకు సిర్పూర్‌టౌన్-కరీంనగర్(07766), కరీంనగర్-బోధన్ (07893)రైలు, మే28 నుంచి జులై1 వరకు బోధన్-కరీంనగర్ (07893), కరీంనగర్-సిర్పూర్‌టౌన్ (07765) రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలియజేశారు. మే 27 నుంచి జూన్ 30 వరకు నాందేడ్-రాయచూర్(17664) రైళ్ల తాండూర్-రాయచూర్ మధ్య, మే 27 నుంచి జులై 1వరకు రాయచూర్-పర్బణి రైలు(17663) రాయచూర్-తాండూర్‌ల మధ్య పాక్షికంగా రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

## నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 22: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబేరుడిని దర్శనం చేసుకున్నారు. అలాగే హనుమాన్ దీక్షాపరులు ప్రసన్నాజంనేయ ఆంజనేయ, రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహ మూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.




## నత్తనడకన నీటిశుద్ధి ప్రాజెక్టు పనులు

**- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

గోదావరిఖని, మే 22: సింగరేణి యాజమాన్యం గోదావరిఖనిలో కార్మిక, అధికార కుటుంబాలు, ప్రజల అవసరం కోసం నిర్మించ తలపెట్టిన నీటిశుద్ధి ఫిల్టర్ బెడ్ పనులు నత్త నడకన సాగుతున్నాయని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. రూ.20కోట్ల వ్యయంతో సింగరేణి యాజమాన్యం నిర్మించే రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్‌బెడ్ నిర్మాణ స్థలాన్ని బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. గత వేసవిలో తీవ్ర నీటి ఎద్దడిని కార్మికులు, అధికారుల నివాస ప్రాంతాల్లో ఎదురయ్యాయని, నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రూపొందించిన ప్రణాళికలు ప్రాథమిక దశలో ఉండటం శోచనీయమన్నారు. రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనుల జాప్యంతో కార్మికులను అనారోగ్యానికి, అశాంతికి గురవుతున్నారు. కార్మికుల నివాస ప్రాంతాల్లో సరఫరా అవుతున్న నీరు స్నానానికి, వంటకు కూడా వాడటం లేదని పేర్కొన్నారు. కార్మికవాడల్లో సింగరేణి యాజమాన్యం ఇప్పటి వరకు కేవలం 3ఆర్‌వో ప్లాంట్లను మాత్రమే ఏర్పాటు చేసిందని, ఇవి సరిపోవడం లేదన్నారు. ఆర్‌వో ప్లాంట్ వద్ద కార్మికులు, వారి కుటుంబ సభ్యులు నిలబడలేక డబ్బులు వెచ్చించి ప్రైవేట్ ఆర్‌వో ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, దూట శేషగిరి, జనగామ మల్లేష్, వాసర్ల జోసెఫ్, రమేష్, భాస్కర్, అంజయ్య ఉన్నారు.

# కార్మికుల క్వార్టర్లకు కలుషిత నీటి సరఫరా



ఆర్జీ-3లో కార్మికుల నివాసలకు సరఫరా అవుతున్న కలుషిత నీరు

రామగిరి, మే 22: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ కార్మికుల కుటుంబాలకు కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. గోదావరిఖని ఇన్‌టేక్‌వెల్‌లో మోటార్‌లో సాంకేతికంగా లోపం తలెత్తిన కారణంగా మైన్ వాటర్‌ను సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయిల్ కలిసిన నీరు రావడంతో కార్మిక కుటుం బాలు ఇబ్బందులు పడుతున్నాయి. నిత్యం 6లక్షల గ్యాలన్ల నీరు సరఫరా అవసరమయ్యే కాలనీకి అంతే సామర్థ్యం కలిగిన ఫిల్టర్ బెడ్ ఉండడంతో నీరు సక్రమంగా ఫిల్టర్ కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫిల్టర్‌బెడ్ సామర్థ్యాన్ని మరింత పెంచాలనే ప్రధాన డిమాండ్ కార్మికుల నుంచి వ్యక్తం అవుతోంది. గోదావరిఖని నుంచి సరఫరా నిలిచిపోవడంతో ఏపీఏ డివిజన్ పరిధిలోని 10వ గని నుంచి సెంటినరీకాలనీకి నీటి విడుదల చేస్తున్నారు. దీంతో గని నుంచి వచ్చే నీరు ఆయిల్‌తో కలిసి మురికిగా మారి వస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి సరఫరా చేస్తున్న నీటితో కనీ సం స్నానం చేసే పరిస్థితి లేదని కార్మిక కుటుంబాలు వాపోతున్నారు. అసలే వేసవి ఆపై కలుషిత నీరు సరఫరా కావడంతో నీటిని వినియోగిం చుకోలేక హ్యాండ్‌బోరులపై కార్మికులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. సింగరేణి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### మౌలిక వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, మే 22: గనులపై కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే5గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ పర్స సత్యనారాయణకు ఘన నివాళి



పర్స సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

రామగిరి, మే 22: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిలోని సెంటినరీకాలనీ సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ పర్స సత్యనారాయణ వర్ధంతిని సీఐటీయూ నాయకులు బుధవారం జరుపుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సింగరేణి కార్మికులకు చేసి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, కార్యదర్శి కొంరయ్య, నాయకులు కుమార్, వెంకటేశ్వర్లు, వేణుగొపాల్, నరేష్, అరవింద్, తిరుపతమ్మ, కుమారస్వామి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ :** ఆర్‌జీ-2లోని కాలనీ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం పర్స సత్యనారాయణ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి హాజరై మాట్లాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 డివిజన్ అధ్యక్షులు భానోత్ విజయ్, ఉపాధ్యక్షులు ఎస్ వెంకన్న, డివిజన్ ఆఫీస్ బేరర్స్ అట్ల సంపత్ కుమార్, అవినాష్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఏ భూమయ్య సిహెచ్ లక్ష్మీనారాయణ,

## భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్

రామగిరి, మే 22: సింగరేణి నిర్ధేశించిన లక్ష్యాలను భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో పర్యటించారు. అందులో భాగంగా డివిజన్‌లోని ఓసీపీ-2 లోని 3వ సీమ్ ఏఎల్‌పీ కొనసాగే పనులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రణాళికాబద్ధంగా సాధించుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగుల పర్స నల్ ఫైల్, ఫోటో డిజిటలైజేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, క్వార్టర్స్ ఉద్యోగుల గైర్హాజరు, కోర్టు పెం డింగ్‌లో ఉన్న కారుణ్య నియామక ఉద్యోగాల దరఖాస్తులు, టర్మినల్ బెనిఫిట్స్ తదితర అంశాల అధికారులతో చర్చించి ఈనెల చివరి వరకు పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు రఘుపతి, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, జనార్ధన్, ఐలయ్య, సుధాకర్, మల్లన్న, రాజేశ్వరి, సునీల్ ప్రసాద్, హరీష్, మధిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాజా మొయినుద్దీన్‌కు మహామయూర పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఖాజా మొయినుద్దీన్

మంథని, మే 22: ఏఎన్ఎస్-24 టీవీ-ఎస్ఎస్ఆర్‌కే అకాడమీ వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మహా మయూర ప్రతిభా పురస్కారాన్ని సామాజిక సేవా రంగంలో మంథనికి చెందిన ఖాజామొయినుద్దీన్‌కు హైదరాబాద్‌లో బుధవారం ప్రదానం చేశారు. కరోనా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయటానికి లైవ్‌షో ద్వారా 188 నిమిషాలు అనర్గళంగా మాట్లాడిన ఖాజా మొయినుద్దీన్‌కు పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.వేలు ఆనందచారి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత చింతపట్ల వెంకటచారి, మల్కాజ్‌గిరి జడ్జి బుర్గుల మధుసుదన్‌లు మహా మయూర ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ఖాజా మొయినుద్దీన్ మహామయూర పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

మంథని రూరల్, మే 22: మంథని మండలం రచ్చపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంథని మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్‌ను బుధవారం మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులు అడ్డుకున్నారు. మంథని మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం రచ్చపల్లి వద్ద స్థలం కేటాయించడంతో డంపింగ్ కోసం ట్రాక్టర్ వెళ్లడంతో చెత్త డంపింగ్‌తో తమకు ఇబ్బందులు తలెత్తుతాయని ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. రచ్చపల్లి వద్ద డంపింగ్ యార్డును నిలిపి వేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ జనగామ నర్సింగరావు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఏవో తూము రవీందర్‌కు వినతిపత్రాన్ని గ్రామస్థులు అందజేశారు.

### లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దపల్లి రూరల్, మే 22 : మండలంలోని అందుగులపల్లి, దేవునిపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి లక్ష పుష్పార్చనతో పాటు, సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని అర్చకులు కొండపాక శ్రీకాంతచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కొండపాక నరసింహ చరణ్ కుమారాచార్యులుపాల్గొన్నారు.

### కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన బాలికలకు సన్మానం



బాలికలను సన్మానిస్తున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, మే 22: గోవాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మండలంలోని వెన్నంపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించారు. శ్రీ హర్షిని, వైష్ణవి, నిహారిక, శ్రీనిత, నిదర్శిని గోల్డ్‌మెడల్ సాధించగా బుధవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించి బాలికలకు నగదు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కారుకూరి సత్యనారాయణ, కుర్మ మధుకర్, ఎంబాడి తిరుపతి, కంది ఆనంద్, వెల్మరు జనార్ధన్, కారుకూరు శంకరయ్య, అంకతి రాజయ్య, బట్టి సదానందం, కందుల నాగరాజు, కాంపెల్లి సతీష్ పాల్గొన్నారు.

### మద్యం దుకాణాల తనిఖీ

కమాన్‌పూర్, మే 22: మండలంలోని గుండారం క్రాస్ రోడ్డులో గల మద్యం దుకాణంతో పాటు మండల కేంద్రంలోని మరో మద్యం దుకాణాంను పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. వైన్స్ షాపులకు అనుమతులతో పాటు పర్మిట్ రూమ్ అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాలు ఆరా తీశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ చంద్రశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐ సాయికుమార్‌లు ఉన్నారు.

### నేత్రదాతకు సంస్మరణ సభ



సవిత కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కోల్‌సిటీటౌన్, మే 22: గోదావరిఖని స్వతంత్ర చౌక్‌కు చెందిన నేత్రదాత జంగంపల్లి సవిత సంస్మరణ సభ బుధవారం మార్కండేయకాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నేత్రదాతకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేత్రదాత భర్త పోశం, కూతుర్లు, కుమారులను సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణా రెడ్డి సత్కరించి అభినందన పత్రాన్ని అందజేశారు. నేత్ర, అవయవ, శరీర దానంపై ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, జిల్లా అధ్యక్షుడు ఆరెపెల్లి రాజమౌళి, మహిళా ప్రతినిధురాలు జ్యోతి అవగాహన కల్పించారు. అందరికీ సూర్తిగా నిలిచిన నేత్రదాత కుటుంబాన్ని పలు సంఘాల ప్రతినిధులు తానిపర్తి గోపాల్ రావు, మాదాసు రాంమూర్తి, సానా రామకృష్ణా రెడ్డి, పూర్మ శ్రీనివాస్ అభినందించారు. అందరూ నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలసాని స్వామిగౌడ్, కొమురయ్య, మల్లిక్, బాషామియా, అయిలయ్య, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 'పర్యవేక్షణ లేకుండానే మట్టి తరలింపు'

కమాన్‌పూర్, మే 22: మండలంలోని జూలపల్లి పెద్ద చెరువులో అధికారుల పర్యవేక్షణ లేకుండానే మట్టి తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలను విరుద్ధంగా 24 గంటలు మట్టి తరలింపు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. నాడు బీఆర్ఎస్ నాయకులు వేలాది లారీల్లో ఇసుక మట్టిని అక్రమంగా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేశారన్నారు. మరి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారు చేస్తున్న దేమిటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు తాటికొండ శంకర్, గుర్రం లక్ష్మీమల్లు, నీలం శ్రీనివాస్, బొమ్మగాని అనిల్‌గౌడ్, తోట రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

### అన్నదానం

సుభాష్‌నగర్, మే 22: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నాగశిరోమణి, హరీష్, బుక్క మనోజ్‌కుమార్‌ల సహకారంతో నగరంలోని కూలి పని చేసుకునే చిరు వ్యాపారాలు చేసుకునే పేదవారికి అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, సాజీద్, తదితరులు పాల్గొన్నారు.